మనిషి

శ్రీ సి. యస్. సి. మురళి

రాజుకు బెజవాడ కొత్త.

బెజవాడకి దుమ్ము, దూగర, మలినం, మశానం, మరుగుదొడ్లలాంటి యిళ్ళు క్రొత్త కాదు. వాటి పేరు చెప్తే 'ఓహో! అది బెజవాడకు మరో పేరులే గురూ!' అంటారు కొందరు. బెజవాడకి ముష్టివాళ్ళు కూడా కొత్తకాదు, ఏవూరికీ వాళ్ళు కొత్త కాదనుకోండి! బెజవాడ వాళ్ళకి ముఖ్యస్థానంలాంటిదేమో! ఇక్కడున్నన్ని సౌకర్యాలు వాళ్ళకి మరెక్కడా దొరక్కపోవచ్చు. క్రొత్తగా వచ్చాడేమో, ఈ విషయం గమనించలేదు రాజు. అందుకనే ఆ కుర్రాడు, ఆ పరిసరాలు అలా చేశాయి రాజుని. అంతగా కదిలించాయి అతన్ని

ఆ ఊరొచ్చి పదిరోజులే అయినా ఇరవయ్యోసారి ఆ రోడ్డుమీద వెళ్తున్నాడు రాజు. రైలుబ్రిడ్జి మరో పది గజా లుందనగా కడుపులో తిప్పడం ప్రారంభం అయింది. అది శారీరకఅస్వస్థతకాదు. కుష్ఠుతో పుచ్చిపిడిన కాలును చూస్తే కలిగే వికారం. చీము కంటపడితే కలిగే రోత. కడుపులో ప్రేగులు కళ్ళముందు నాట్యంచేస్తుంటే, అదే కనక సాధ్యపడితే, కలిగే కంపరం.

ప్రత్యేకించి ఆ రోడ్డుమీద నడవడంఅంటే రాజుకి మహాచెడ్డ చిరాకు. కానీ, అలా నడవకుండా ఆఫీసుకి వెళ్ళేమార్గం కనిపించలేదు. ఆ ప్రాంతాల చేరుతుంటే ఈ కళ్ళు లేకపోతే ఎంత బాగుండు ననిపించడం; వళ్ళు జలదరించడం, సంఘంమీద ఛీత్కారం జనించడం.

ఈ లక్షణాలన్నీ ఏమిటి రాజూ? ఎందుకీ కమ్యూనిష్టు కలవరం? ఏం చూశావేమిటి?

రాజేం చెప్తాడు పాపం! అమాయకుడుకాదు. కానీ అంతటివాడే! అంటే ఆదర్శాల ప్రోగన్నమాట. ప్రపంచంలో అందరూ ఎందుకు ఒకలా సుఖపడకూడదంటాడు. తమతమ భేదాలే సృష్టికి మూల స్తంభాలని ఎందుకో అర్థం చేసుకోడు. డబ్బున్న ధనరావు మనోరమ హోటల్లో ఎయిర్ కండిషన్డ్‌లో పడుకోడం, అదిలేని దరిద్ర నారాయణుడు ఏలూరు కాలవ ప్రక్కనో, బెజవాడ బస్ స్టాండ్ దగ్గర సైడుకాలవ సైడుగానో పడుకోడం సృష్టి ధర్మం అని అంగీకరించడు. ఇవన్నీ మనిషి కల్పించిన కృత్రిమా అని ఘోషిస్తాడు

ఏం చూశాడో రాజు?

ఏం లేదండి మామూలు దృశ్యమే! బెజవాడ నాగరీకులకి అలవాటయి పోయినదే!

మొదటిసారి చూచినపుడు ఆ కుర్రవెధవ బ్రతికున్నాడో, చచ్చిపోయాడో తెలీలేదు రాజుకి. బ్రిడ్జికి పది గజాల దూరంలో పేవ్‌మెంటుమీద ఓ గుడ్డపరిచి వుంటుంది. దానిమీద వాడు బోర్లా పరుచుకుమంటాడు. వాడికి ఛత్రంలాగా బ్రిడ్జి గోడకూ, ఓ రెండు కర్రలకూ ఓ గుడ్డ కట్టి వుంటుంది ఆ గొడుగు లేనట్టేవాడిమీద ఎండ పడి వేయిస్తూంటుంది వాణ్ని కూర కొట్టి వాడు విసిరి పారేసిన కుళ్ళు వంకాయలా వుంటాడు ఆ కుర్రవెధవ. కుక్కలూ, వరాహాలూ దారి ప్రక్కన విసర్జించి వెళ్ళిన మలినపు పోగులాంటి వాడు. కానీ మలినపు పోగుకాదు: మనిషే! మనుషులందరూ బహిష్కరించి వాతావరణానికి వదిలి పారేసిన మాంసంముద్ద. ఎముకల ముగ్గు. అలాంటి వాణ్ణిచూసి ఈ రాజుకి బాధ, వికారం.

వాడికి వయసెంత వుండచ్చా అని ప్రశ్నించుకున్నాడు రాజు మొదటిసారిచూచి. చెప్పడం కష్టం. అయిదునుంచి పన్నెండేళ్ళవరకూ ఎంతైనావుండవచ్చు.

ఆకారంమాత్రం ఓ సంవత్సరంపాటు ఎదిగింది. మొహం నాలుగు సంవత్సరాలకు సరిపడా ముదిరింది.

కరుచుకు పడుకున్నప్పుడు (పడుక్కోడం అంటే శవంలా పడుండడం) రెండడుగులు మించకుండా పొడుగుంటాడు.

వానలేక బీటలు వారిన నల్లరేగడి నేల లాగా, గేదె తోలులాగావుండే చర్మం. ఎర్రటిపుళ్లు మొహంమీద. ఎడ్లపుళ్లని కాకులు పొడిచినట్లు వాడి పుళ్లని ఈగలు పొడుస్తుంటాయి. మనిషే కాకంతవుండడంమూలాన కాకులు వాణ్ణి పొడవడం కుదరదు. అయినా మనుషులందరూ బహిష్కరించిన వాణ్ణి కాకులుమాత్రం ఎలా ముట్టుకుంటాయి?

ఈగల్ని తోలుకుందుకు వాడికి కోర్కెవున్నట్లు కనిపించదు. కోర్కెవున్న ఆస్కారంలేదు. వాడి కాళ్లు మొలవరకూ, చేతులు చంకలవరకూ బాండేజిలో వుంటాయి. కాళ్లూ చేతులు కావు అవి. మురి క్కాడలు. మొదట కట్టినపుడు ఆ బాండేజీలు తెల్ల గానే వుండుండాలి. కాని యిప్పుడుమాత్రం మట్టి పట్టి మాసిపోయాయి. వాడికాలుచేతులకంటే ఆ సిమెంటు బేండేజి బరువే ఎక్కువుంటుంది.

వాడిచేతనయిన వ్యాపారం ఒక్కటే! ఆ వ్యాపారంలో వాడి మొహంమీది పుళ్లు ఆ బాండేజీల్లో వేళ్లాడే కాళ్లు చేతులు చాలా ముఖ్యం. అవే వాడి యోగ్యతాపత్రాలు. చుంద్రు, పేలు కలిసి మూకఉమ్మడిగా కొరికేయి వాడి జుట్టు. మాసికలు పడ్డ పాతకంబళీలాంటి తల. వర్షవాతాతప, జంతు, శైథిల్యంవలనపోగా మిగిలిన కాసిని వెంట్రుకలూ మట్టిరంగులో వున్నాయి.

హైద్రాబాదువేపు కాముడి పండక్కి కుర్ర కారు తయారుచేసే కాముడిబొమ్మలా వుంటాడు మొత్తంమీద, ఏభాగాని కాభాగం పట్లువేసి బిగించి నట్టు. వాడి తల్లి కడుపులో వున్నప్పుడు కడుపు నిండా తిన్నాడేమో బహుశః నేలమీదపడ్డ తర్వాత శరీరానికి పోషణ లభించివుండడం జరిగుండే అవ కాశంలేదు.

ఆ కుర్రవెధవని చూసినపుడల్లా రాజుకు బాధ కలిగేది. తనమీద తనకే తెలియని విసుగు, చిరాకు. చుట్టూ నిర్లిప్తంగా ఏం జరగనట్లుగా తిరిగే జనాన్ని చూస్తే ఆశ్చర్యం కాని వాళ్లేం చేస్తారు? వాళ్లూ మామూలు మనుషులే!

అలాంటి వేలాది ముష్టివాళ్లు తిరిగే యీ దేశంలో అందులో కొత్తేం వుందని? దారిన నడిచి పోయే దౌర్భాగ్యులకి ఈ మాంసంముద్దని చూస్తే కడుపులో తిప్పుతుంది. కరుణతో హృదయం గాభరా పడుతుంది. జేబులోంచి ఓ పైసానో రెండో తీసి పడేసి గబగబా వెళ్లిపోతారు. డబ్బున్నవాళ్లు కాలి మీదవెళ్లే అవకాశమేలేదు. అటువంటివాళ్లకి వీళ్లని చూసే కర్మేం పట్టిందని?

రోజూ ఆ కుర్రవెధవ పడుక్కునున్న గుడ్డ మీద చిల్లర డబ్బులుపడేసుంటాయి, అక్కడ వాడొక్కడే కాదు. ఓ కళ్లులేని కబోది, కాళ్లులేని ముసిలాడుకూడా వుంటారు. 'ధర్మంబాబూ! మీ బిడ్డలూ, పాపలూ సుఖంగా వుండాలయ్యా' అంటూ దీవిస్తుంది గ్రుడ్డిది.

'పైసా ఎయ్ బాబూ! కాళ్లేనోడ్నండయ్యా!' అంటూ గుండెలమీద బాదుకుంటుంటాడు, పేవ్ మెంటుమీద పడి ముసిలాడు. ఈ ముగ్గుర్లోనూ వయస్సు తక్కువైనా వాడికున్న అర్హతలనిబట్టి కుర్రవెధవకే ఎక్కువ డబ్బులు గిట్టుబాటవు తూంటాయి.

'వీడు కాళ్లమీద నిలబడలేడే! మరి వీడు రోజూ యిక్కడ కెలా వస్తున్నాడో' అని అనుమానం వచ్చింది రాజుకు.

ఎవరో వీడ్ని రోజూ యిక్కడకి తెచ్చిపడుకో బెడ్తూ వుండాలి. ఈ రహస్యం ఏమిటో తెలుసుకోవా లని అనిపించింది.

రోజూ ఆఫీసు టైం అయిపోతోంది. అప్ప టికే వాడు అక్కడ హాజరై పడుంటున్నాడు.

ఓ ఆదివారం ప్రొద్దున్నే బయలుదేరాడు రాజు వంతెన దగ్గరికి.

అప్పుడే తెల్లవారుతోందనగా ఓ డొక్కు లారీ వచ్చి ఆగింది వంతెనకింద. లారీ వెనక తలుపు తీశాడు క్లీనర్నాంటి కుర్రాడొకడు. అందులోంచి ముందు గుడ్డిది దిగొచ్చింది.

'బేగి దిగే లంజకానా' అంటూ దాని డొక్కలో వేలెట్టి పొడిచాడు వాడు.

'ఓరి లంజకొడకా; దిగటల్లేదంటారా?' అంటూ వాడి జుట్టు పట్టుకుంది అది.

'జుట్టు ఒగ్గెయ్యే గుడిసేటిముండా!' అంటూ ఓ చేత్తో దాని జబ్బట్టుకుని కిందకి దిగలాగి వదిలాడు క్లీనరు కుర్రాడు. కాలు మడతపడి కింద కూలబడింది గుడ్డిది.

'సచ్చిపోనాగదరా దొంగసచ్చినోడా! నీ కడుపు నెట్టేసుకున్నావురో' అంటూ ఏడ్పులంకించుకుంది అది.

'ఏడవకే ఎదవలంజకానా!'అంటూ చెయ్యట్టు గుంజి రెండోచేత్తో ఎడంరొమ్ముమీద ఓ గుద్దు గుద్దాడు క్లీనరు కుర్రాడు

రాజా కడుపులో తిప్పింది. పిడికిళ్లు గట్టిగా బిగించుకుపోయాయి మరో క్షణంలో ఆ కుర్రాడి మీదపడి వాడి పీక పిండేసేవాడే! కాని గుడ్డిదన్న మాటలు అతన్ని నిశ్చేష్టుడ్ని చేశాయి

'అప్పుడే యిదో సరసం ఏడనేరిసినావురో' అంటూ కిసుక్కుమని నవ్వింది.

రాజాకి అసహ్యంవేసింది. నిలుచున్నచోటనే పాతుకుపోయాడు.

'ఒరే కుర్రలంజకొడకా! ఇంకా దింపలేదట్రా ఆ సచ్చినోళ్లని'అంటూ చుట్ట నోట్లోంచితీసి తుపుక్కున ఉమ్మేసి అరిచాడు డ్రైవరు.

'దిగుతున్నారహే'అంటూ తిరిగి అరిచాడు కుర్రాడు. నవ్వుకుంటూ గోడదగ్గరకువెళ్లి కూర్చుంది అది.

'నన్ను దింపి పండబెట్టవురా సాయిబూ!' అంటూ కాళ్లులేని ముసిలాడు అరిచాడు లారీలోంచి.

'ఉండరా తాతలంజా డు..! గడ్డం నెరిసింది. పళ్లు రాలాయ్. రకతం నెల్లారిసచ్చింది. నువ్వెందుకురా యింకా యీ బతుకుబతకడం,'అంటూ ముసిలాడ్ని దించాడు కుర్రాడు.

'నా పెళ్లాం మొన్నగాదట్రా సమర్తాడిందీ. అప్పుడే సచ్చేం లాబం సెప్పు', అంటూ నవ్వాడు ముసిలాడు.

నవ్వలేదు క్లీనరుకుర్రాడు. రాయినో రప్పనో మోసుకెళ్లినట్టు ముసిలాడ్ని మోసుకెళ్లి ఫుట్‌పాత్ మీద పడుకోబెట్టి మళ్లీ వచ్చాడు.

'ఇంకా గుడ్డిముండతో సరసం కాలేదట్రా దొంగ...ముండాకొడకా,' అంటూ తలుపు తీసుకుని దిగాడు డ్రైవరు. రాజావంక చూశాడు. గబుక్కున దారిప్రక్కన అయిష్టంగా కూర్చున్నాడు రాజా, కాలకృత్యంకోసం కూలబడ్డవాడిలా. డ్రైవరు మనసు మార్చుకుని రెండోవైపుకు వెళ్లిపోయాడు.

క్లీనరు కుర్రాడు ముసిలాడ్ని పడుకోబెట్టి వచ్చి లారీలోంచి ఆ శవం కుర్రాడ్ని బయటకితీశాడు. గోడకి, కర్రలకి గుడ్డకట్టి, నేలమీద గుడ్డపరిచి వాడ్ని పడుకోబెట్టి గుడ్డిదానిదగ్గరకెళ్లి దాని బొడ్డు దగ్గర రొంటిలో చెయ్యెట్టి ఓ నాలుగణాల బిళ్లేదో (దూరంనుంచి రాజాకి సరిగ్గా కనిపించలేదు అది) తీసి, 'రేతిరేళకి పూలట్టుకొస్తనే ముండా' అన్నాడు క్లీనరు కుర్రాడు.

'మల్లెపూలు తేరా సాయిబూ!' అంది గుడ్డిది.

కళ్లు లేకపోయినా ఈ గుడ్డిదానికి మల్లెపూలంటే యింత మమకారం ఏమిటా అనుకున్నాడు రాజా.

క్లీనరూ, డ్రైవరూ లారీ తోలుకుంటూ వెళ్లిపోయారు.

అంతవరకూ చూసిం తర్వాత ఏం చెయ్యాలో అర్థం కాలేదు రాజాకి. తన కళ్లతో తనుచూసి

ఉండకపోతే అదంతా ఏ పురాణం శాస్త్రులు చెప్పిన కట్టుకథో, పిట్టకథో అనుకునేవాడు.

'ఇదో పెద్ద వ్యాపారం అన్నమాట. కుష్ఠు వాళ్లని, గుడ్డివాళ్లనీ, చచ్చిపోతూన్న వాళ్లనీ, చావబోతూన్న వాళ్లనీ, ఎముకలు విరిగిన వాళ్లనీ, ఎముకలు కుళ్లిన వాళ్లనీ ముడిసరుకుగా చేసుకుని వర్తకం చేస్తున్న ఈ దరిద్రుడెవరో! ఎంతటి నైచ్యానికి ఒడిగట్టగలడు మనిషి? ఈ వెధవ పుట్టుక పుట్టేకంటే నీట్లో చేపగానో, కప్పగానో పుట్టిచచ్చిపోతే ఎంత బాగుండును', అనిపించింది రాజాకి.

గుడ్డిదాని దగ్గరకు వెళ్లాడు.

'ఇదుగో గుడ్డమ్మాయ్, నీ పేరేమిటి?'

'ఎవరు బాబూ మీరు: సీకట్లో వచ్చారు మహారాజులా—ఓ పైసా యిప్పించండయ్యా'

'నీ పేరడిగితే మాట్లాడక ముష్టడుగుతావేం?'

'నా పేరేం చేస్కుంటారు బాబయ్యా! గుడ్డి ముండని నన్నందరూ గుడ్డి మీనాక్షి అంటారండి'

'పేరు మీనాక్షి. నీకు కళ్లు కనిపించవు. బాగుంది.'

'దానికేముందండి. సీతమ్మ పేరెట్టుకుని రాత్రిపూట యేపారం చేస్కునేవోళ్లెందరులేరండి? రామయ్య పేరెట్టుగుని పూలరంగళ్లుండరాండి... గుడ్డిముండకి. దయచూపండి బాబయ్యా ఓ పైసా ధర్మం ఎయ్యండి మీదే బోణీ...'

'నిన్ను లారీలోంచి దింపిన వాళ్లెవ్వరు?'

'ఏ లారీఅండి? దింపడం ఏంటండి? రాత్రి ఏప్పాన్న మందింకా దిగలేదా బాబయ్యా—గుడ్డి ముండని. నాకే లారీ కనిపించలేదండి.'

'అబద్ధాలాడుకు—నిన్ను లారీలోంచి ఆ సాయిబు దింపడం నే చూళ్లేదా? నీ గొంతెనున్న డబ్బులు వాడు లాగడం చూళ్లేదా? మళ్ళ వాడ్ని మల్లెపూలు పట్టమ్మని చెప్పడం నే విన్లేదా? చెప్పు! ఆ లారీ ఎవరిది? ఆ కుర్రాళ్లెక్కడుంటారు? మీచేత యీ వ్యాపారం చేయిస్తున్నవాళ్లెవ్వరు?' అని గర్జించాడు రాజా.

గుడ్డిది భయపడింది సన్నగా ఏడుపు లంకించుకుంది. అంతకుముందు ఏడ్చినట్టు కులుకుతూ ఏడ్వలేదు.

'మీ పాదాల సాచ్చిగా నేనేపాపం ఎరగను బాబయ్యా! లారీలో వచ్చినమాట నిజమేనండి. మాచేత ఓ పెద్దాయన యాపారం చేయించేమాట నిజమేనండి. ఆయన ఎక్కడుంటాడో, ఎలా వుంటాడో గుడ్డి ముండని నే నెరగనండి. బిచ్చమెత్తుకుని బ్రతికే వోళ్లం. మామీద కోపం తెచ్చుకోకండి బాబయ్యా!' ఏడుస్తూనేవుంది గుడ్డిది.

వివేకం వద్దంటున్నా; జాలిమాట కాదనలేక జేబులోంచి ఓ అయిదుపైసలబిళ్ల తీసివేసి బరువుగా యింటిదారి పట్టాడు రాజా.

కాళ్లులేని ముసిలాడ్ని అడుగుదామనుకున్నాడు. కాని ఏం లాభం? ఏదో యిలాగే చెప్తాడు నాలుగు మాటలు. అంత తేలిగ్గా నిజంచెప్పి సంఘంముందు నిలబెట్టేట్టు వీళ్లని ఎందుకు తర్ఫీదుచేస్తాడు ఆ నీచుడు. ఎన్నోజాగ్రతలు తీసుకుని. ఎందర్నో కలుపుకునిగాని యీ వ్యాపారాలు జరగవుఅనే లౌక్యాన్ని కొద్దిగా అర్థం చేసుకున్నాడు రాజా.

కానీ ఈ మనిషిరూపంలోవున్న మాంసం ముద్దల్ని చూసి మనసు చెరుపుకోవడం మానలేదు అతను. ముఖ్యంగా ఆ కుర్రాడ్ని చూసినపుడల్లా మనిషిగా బ్రతకడం నేర్పలేనపుడు, లారీటైర్ల క్రిందపడి నలిగిపోయిన కుక్కపిల్లశవంలా వుండే వాడ్ని అక్కడ లేకుండా చేసేస్తే బాగుండునని అనిపించేది రాజాకు.

రెండురోజులపాటు రాజా ఆఫీసుకు వెళ్లలేదు శలవలవల్ల. మూడవరోజు వెళ్లేటపుడు ఆ గుడ్డిది, ముసిలాడు కనిపించారుగాని కుర్రాడు కనిపించలేదు. కుతూహలాన్ని చంపుకుని వెళ్లిపోయాడు రాజా.

నాలుగవరోజు, ఐదవరోజు కూడా వాడు కనిపించక పోయేసరికి ఆగలేకపోయాడు. ఆరవరోజు ప్రొద్దున్నే వంతెనదగ్గరకువెళ్ళాడు లారీవచ్చి ఆగింది. సరసాలూ, మోటుమాటలూ లేకుండా గుడ్డిది దిగి గోడప్రక్కన కూలబడింది ముసిలాడ్ని సాయిబు మాటావుంతీ లేకుండా తీసికెళ్ళి పడుకోబెట్టాడు.

లారీ వెళ్ళిపోయాక నెమ్మదిగా గుడ్డిదాని దగ్గరకు వెళ్ళాడు రాజు.

'ఇదుగో గుడ్డిమీనాక్షీ...' అన్నాడు నెమ్మదిగా.

'మీరా బాబుగారూ! మళ్ళా వచ్చారేంటండి? మా బతుకులు మమ్మల్ని బతకనివ్వండి బాబయ్యా' అంటూ ఏడ్పు లంకించుకుంది అది సన్నటిరాగాన.

'మీరు బ్రతుకుతున్నారని ఎవ్వరన్నారు మీనాక్షీ! మీ చావులు మిమ్మల్ని చావనివ్వమని అడిగుండాల్సింది' అన్నాడు రాజు విచారంగా.

'పోనీ అలాగే కానీండి! గుడ్డిముండని చదువు రాదు. ఫుట్‌పాత్‌మీద పుట్టాను మురుగుకాల్వలో పడి చచ్చిపోయే పురుగులాంటిదాన్ని......నా యెంట ఐడ్డారేంటి బాబయ్యా......ఈ పావన్నా నన్ను పావనివ్వరా?'

'మీనాక్షి — ఇక్కడో కుర్రాడుండేవాడు చూడు—వాడేమయ్యాడు తెలుసా?'

'వాడాండి – పుల్లెంకడాండి?'

'వాడికో పేరుకూడా వుందేమిటి! ఆ పుల్ల యెంకడే...' అన్నాడు రాజు.

'పేరెందుకుండదండి. ఈగని ఈగ అంటం లేదండి. దోమని దోమనర్టండి! అలాగే ఆడిపేరు ఎంకడు. పుల్లలాగా వుండేటోడని పుల్లెంకడన్నా రండి—నా తమ్ముడే కదంటండీ ఆడు...'అంటూ సన్నటిఏడ్పు సాగించింది గుడ్డిది.

దాని ఏడుపులో నటను వ్నట్లనిపించలేదు ఈ మారు. సహజంగా, బాధపడుతున్న హృదయంనుండి వచ్చే ఏడుపులాగే వుంది.

'నీ తమ్ముడా వాడు'

'తమ్ముడంటే తోడబుట్టిన వోడుకాదండి. రాత్రిపూట ఆడ్ని వేనే దగ్గర పండబెట్టుకుని ఆలిచ్చే దాన్నండి. ఎర్రిఎదవ – తెల్లవార్లూ మొవం మీద పుళ్ళు మంటపెట్టి ఏడ్చేటోడండి. ఆయ్యేం పుళ్ళో తెల్లోరే సరికి మంట దిగిపోయేదండి'.

రాజు మాట్లాడలేదు ఓ నిమిషం.

'ఏడ్చేవాడా! వాడు మాట్లాడేవాడు కూడానా?'

'ఏంటండి బాబయ్యా; అంత యిసిత్రం! ఆడికి పదేళ్ళనేవుటండి. బాధపెడ్తే సంటోళ్ళే ఏడస్తారుగదండీ! ఆడు ఏడ్వలేడా? 'అక్కా...అక్కా' అంటా పిలిసేవోడండీ'

ఈ గుడ్డిదాని ప్రపంచంలో ఇలాంటివి మామూలుకనక దానికి రాజు ఆశ్చర్యం బోధపడ లేదు. కాని చచ్చిపోయిన వాడితో సమానంగా రోడ్డు మీద పడుంటే వాడు ప్రాణంవున్న వాడంటేనే ఆశ్చర్యంగా వుంటుంది మనకి. అందుకే పాపం రాజు కూడా ఆశ్చర్యపడాడు.

'ఇంతకీ పుల్లయెంకడేమయినట్లిప్పుడు?' అడిగాడు రాజు.

'అదే కదండీ చెప్పేది. ఆడ్నెవరో తీస్కెళ్ళి ఏలూరు కాలవలో సడేసినారండి మూడ్రోజులక్రితం. ఎదవ ముండాకొడుకు—ఎవడోనండి ఆడు. ఆడ్ని పోలీసులు పట్టుకుని శీకిన్న జన్మస్థానంలో ఏశార్టండి. ఎందుకు సంపినావంటే–సంపిందినేకాదూ–మీరే సంపారు. నేను కర్మకాండ చేశానటాట్టండి ఎదవ పిచ్చుంటండి ఆడికి...'

గుడ్డిదింకా ఏడుస్తూనే వుంది. దాని ఏడుపులో ఆ కుర్ర వెధవమీద మమకారం కొట్టొచ్చి నట్టు కనబడింది రాజుకు. ఈ బ్రతుకులూ-యీ బంధాలూ...ఆశ్చర్యం ఏముంది కనక అందులో: గడ్డి మొక్క లోకదానితో అల్లుకోడం లేదూ?

'వాడెవడో వున్నస్థానంలో నేనుండాల్సింది ఈ పాటికి' అనుకున్నాడు రాజు నెమ్మదిగా.

'ఏంటండి అంటున్నారు. అడ్నందరూ ఎలా తిట్టిపోశారో తెల్సాండి పసిబిడ్డను సంపేటోడు కసాయివాడికన్న కనాకష్టం కాదంటండీ. దేవుడెందుకు పుట్టిస్తాడో యిలాంటోళ్ళని...' అని ఏదో అంటూనే వుంది గుడ్డిది.

ఓ పావలా దాని చేతిలోవేసి అక్కడ్నించి కదిలాడు రాజా.

* * *

జైల్లో రామారావుని కలుసుకునే సరికి చాలా కష్టం అయ్యింది రాజాకి. ఓ పట్టాన్న ఒప్పుకోలేదు జైలు సూపరెంటు. తీరా ఆయనొప్పుకునేసరికి రామారావు ఒప్పుకోలేదు.

ఏం చెయ్యాలో అర్థం కాలేదు రాజాకి.

'సార్ ఎలాగైనా అతన్ని కలుసుకోవాలండి. అతను వద్దన్నా ఒకసారి అతన్ని చూడాలని వుంది. మీ కభ్యంతరం వుండదనుకుంటాను, ఇంతవరకూ ఒప్పుకున్నాక' అన్నాడు రాజా.

ఏ కళనున్నాడో జైలు సూపరెంటు అంగీకరించాడు.

రామారావు నల్లగా వున్నాడు జుట్టు బాగా పెరిగి వుండుండాలి జైల్లో ప్రవేశించినపుడు. జైలు మంగలి చెయ్ చేసుకున్న జాడలు కనపడుతున్నాయి. ఖాకీ నిక్కరు, గళ్ళ చొక్కా వేసున్నాడు ప్రమాదకరమైన జాబితాలో నెంబరు వేశారు చొక్కామీద. విడిగా ఓ గదిలో బంధించారు ఆ పెద్దమనిషిని.

పిచ్చివాడిలా కనిపించలేదు రామారావు. కాస్తో కూస్తో చదువుకున్నట్లే వున్నాడు.

రెండు చేతులూ జోడించి నమస్కారం పెట్టాడు రాజా. రామారావుకూడా అప్రయత్నంగా చేతులు జోడించాడు.

'మిమ్మల్ని విసిగించడం నా ఉద్దేశంకాదు. మీతో రెండు మాటలు చెప్పిపోదామని వచ్చాను. మిమ్మల్ని రెండు మాటలు అడిగిపోవాలనికూడా —'

'ఏం చెప్పాలనుకున్నారు?'

'ఇపుడు మీ స్థానంలో మీరుండకపోతే నేనుండే వాడ్ని'

'అంటే...'

'మీరు చేసిన పనే నేను చేసుండే వాడ్ని'

'ఓహ్! అర్థమైంది. పుల్లా ఎంకడ్ని చంపుదామనుకున్నారా మీరు?'

'చంపుదామనుకోలేదు. వాడు బతికుంటేకదా నేను చంపడానికి. పోనీ ఇంతకీ నువ్వేం చేశావో, ఎందుకు చేశావో చెప్పనేలేదు...'

'అందరూ అనుకుంటుంటే వినలేదా? నేను పిచ్చివాడ్ని. హంతకుడ్ని. అందుకే వాడ్ని చంపాను'

'ఆ మాటలన్నీ బయటివాళ్ళతో చెప్పావ్! నేను నీ స్నేహితుడిలాంటివాడ్ని. నాతో కూడా ఎందుకూ ఈ కల్లబొల్లి కబుర్లు!'

'నే చెప్పేనాంట్లో మీకు కొత్తవిషయం ఏం కనిపించదు. నిజానికిది కొత్తకూడా కాదు. నాలా యింతకుముందు ఎవరూ ప్రయత్నించకపోయినా, నాలాగే ఏడ్చివుంటారు...'

రాజా రామారావుకేసి చూశాడు.

సన్నగా నవ్వాడు రామారావు.

'భయంలేదులెండి. నాకు కన్నీళ్ళు రావు. అవొస్తే కాస్తన్నా బరువు దిగజారుతుంది. గుండె మంటన్నా ఆరుతుంది. కాని ఆ అదృష్టం నాక్కాదు......'

'ఓ రోజా—కాదు—వరసగా వందరోజులు తిరిగాను. చదువురానివాడ్నికాదు. అసమర్థుడ్నంతకన్నా కాదు కోర్టుగుమాస్తాలా కేకలెయ్యలేపోను. కాగితాలు ముందేసుకుని చూచి కాపీ రాయలేకపోను. బంట్రోతులా ఇటూ అటూ తిరగ్గలను. అయినా నేను ఎందుకూ పనికిరాలేదు. డస్కు బల్ల ఉద్యోగానికి చదువు చాలదు. బంట్రోతు ఉద్యోగానికి చదువెక్కువైంది. మొత్తానికి ఉద్యోగం దక్కలేదు

కడుపుమంట తీరేమార్గం దొరకలేదు. ఆ విషయం అలా వదిలెయ్యండి. ఎలా బ్రతికేనని అడక్కండి. మురిక్కాలవలో పుట్టిన దోమలాగా బ్రతికాను. ఎంగిలాకుల్లో మిగిలిన మెతుకులకోసం కుక్కలతోటీ, కాకులతోటీ పోటీపడి బ్రతికాను......అలా బ్రతికేది నే నొక్కడ్నీ కాదు. నాలా చాలామంది బ్రతుకుతున్నారు.

'ఓ రోజు ఏం చూశానో తెలుసా? కాలవపక్కనున్న సిమెంటురోడ్డు మీద నడుస్తున్నాను. ఆ రోడ్డు తెలుసుగా, సిమెంటుఫ్యాక్టరీరోడ్డు. రైలుగేటు దాటాక ఒక చోట ఓ పదిమంది కుర్రాళ్లు గుంపుగా వున్నారు. ఏమిటోననిచూస్తే ఓ కుక్క చచ్చిపడి వుంది. దాని కాళ్ళు, చేతులు కాదంటే దాని నాలుగు కాళ్లు కలిపి కట్టారు వాళ్లు. కాలవ ప్రక్కన ఒక గొయ్యి తీశారు. కుక్క తోకపట్టుకుని దాన్ని నెమ్మదిగా ఆ గోతిలో దింపి పూడ్చారు. వాళ్లు కుర్రాళ్లు. అయితేనేం! ఓ కుక్కకికూడా జాగ్రత్తగా మరణానంతర సంస్కారాలు చేశారు. నా కళ్లతో నేను మనుషులు దారిప్రక్కన ప్రాణాలు కోల్పోయి రోజుల తరబడి పడుండడం చూశాను. కాలవ ప్రక్కన, రైలు పట్టాల ప్రక్కన, మురుగుదొడ్ల ప్రక్కన చచ్చి పడుంటారు. వాళ్లని అలా రోజుల తరబడి కాకపోయినా గంటల తరబడి చీమలూ, గద్దలూ కొరుక్కు తింటేగానీ పంచనామాలు జరగవు. జరిగాకగాని పాతిపెట్టడమో, కాల్చివెయ్యడమో జరగదు. మరికొన్ని శవాలు అసలు అలాగే మురుగునపడి పురుగుల వాతబడి కుళ్లిపోతాయి. చచ్చిపోయిన వాళ్లకోసం బాధపడవద్దుపోనీ! బ్రతికున్న వాళ్లు అలా రోడ్డుప్రక్క పడుండడం ఏమిటి? నెమ్మదిగా, నెమ్మది నెమ్మదిగా కుళ్లి కుళ్లి చావడం ఏమిటి? అలా చస్తున్న వాడ్ని చూపించి, వాడ్ని ముడిసరుకుగా వాడుకొని వ్యాపారం చెయ్యటం ఏమిటి? రోత పుట్టదూ హృదయంఉన్న మనిషి కెవ్వడికైనా? అందుకే పుల్లయెంకడ్ని కాలవలో పారేశాను. వాడికి నే చేసింది ఉపకారమే అని నా నమ్మకం' అని నవ్వాడు రామారావు.

'అలా కాలవలో పారేశానో లేదో, యిలా నన్ను పట్టుకొన్నాయి ఎర్రటోపీలు. అవేం చేస్తాయి పాపం; వాటి ధర్మం అది. పారిపోవాలని ప్రయత్నించాను కాని అది తెలివి తక్కువ పని అని యిపుడనిపిస్తోంది. బయటుండి ఉద్యోగంలేక, తిండిలేక నేతిరిగినప్పుడు ఎవ్వరూ నన్ను పట్టించుకోలేదు. ఇక్కడకొచ్చాక రెండు పూటాల్లా తిండి పెడుతున్నారు పని చేయిస్తున్నారు. కంటికి కునుకుంది. కడుపుకి తిండుంది. చేతికి పనుంది. హాయిగా ఉంది యిక్కడ. ఈ ఉద్యోగానికి చదువే అక్కర్లేదు. నాకు మరణశిక్ష వేస్తారనే భయంకూడా లేదు. నేరస్థుల పట్ల దృష్టి మారిందిగా: మమ్మల్ని మామూలు మనుషుల్ని చేస్తారుటగా! గౌరవం, అభిమానంవున్న మంచివాళ్లుగా చేస్తారుటగా: అదే నా భయం: నన్ను వీళ్లు మంచివాడ్నిచేస్తే నే బ్రతకటం ఎలాగా అని?' అని నవ్వి ఊరుకున్నాడు రామారావు.

యింక వినాల్సిందేమీ లేదనిపించింది రాజుకి

'నేను వెళ్తాను బ్రదర్ యింక'అంటూ బయటికి వచ్చేశాడు రాజు.